### యౌవ్వనులకు మరియు పెద్దలకు

# మిషను పొలపు వార్తలు

### దక్షిణ ఆసియా-పసిఫిక్ డివిజను



**నాల్గవ త్రిమాసము**

**అక్టోబరు, నవంబరు, డిశంబరు - 2025**

అనువాదం :

**డాఫోడిల్ & ఎమరాల్డ్**





# స్క్విడ్ చేపలా లేక ఊహించని రీతిగా మిషనరీ అగుట

**అల్వారో, నటాలియా మరియు కాటాలినా–చిలీ**

అల్వారో, నటాలియా దంపతులు దూర ప్రాంతంలోని ద్వీపంలో మిషనరీలు అవుతారని వారెప్పుడూ అనుకోలేదు. ఈ జంట 9 సంవత్సరాలుగా సంతోషంగా జీవిస్తున్నారు. అల్వారో సెవెంత్ డే ఎడ్వెంటిస్ట్ చర్చికి దంతవైద్యుడుగా పనిచేస్తున్నాడు. అతని భార్య నటాలియా చిలీ ఎడ్వెంటిస్ట్ యూనివర్సిటీలో ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తున్నారు. వీరికి 3 సంవత్సరాల కుమార్తె కాటాలినా ఉన్నది.

ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు సువార్తను ప్రకటించే లక్ష్యంతో ప్రపంచ ఎడ్వెంటిస్ట్ చర్చికి సహాయం చేయుటకు ఎడ్వెంటిస్ట్‌లు ఏర్పాటు చేసిన "ఎడ్వెంటిస్ట్ వాలంటరీ సర్వీస్" గురించిన ఒక ప్రసంగాన్ని అల్వారో దంపతులు విన్నారు. దేవుడు వారిని స్వచ్ఛందంగా సేవ చేయుటకు పిలుస్తున్నాడని భావించారు. "కుటుంబంగా మనము దీనిని చేయగలమా?" అని వారు ఒకరినొకరు అడిగారు.

ఎడ్వెంటిస్ట్ వాలంటరీ సర్వీస్‌లో స్వచ్ఛందంగా పనిచేస్తున్న వారు యూనివర్సిటీ విద్యార్థులు మరియు 20 సంవత్సరాల వయస్సు ఉన్న యువతీయువకులు మాత్రమే. అల్వారో మరియు నటాలియాకు 35 సంవత్సరాల వయస్సు ఉన్నది. తాము వయస్సులో చాలా పెద్దవారమని భావించారు.

ఎడ్వెంటిస్ట్ వాలంటరీ సర్వీస్ గురించి ప్రసంగించిన పాస్టరు గారిని కలుసుకొని ఆయనతో అల్వారో దంపతులు మాట్లాడారు. దేవుడు అన్ని వయస్సుల వారిని మిషనరీలుగా పిలుస్తున్నాడని వారికి హామీ ఇచ్చాడు. కాబట్టి ఈ దంపతులు యూనివర్సిటీలో వాలంటరీ శిక్షణ పొంది ఎడ్వెంటిస్ట్ చర్చి వెబ్‌సైట్ వివిడ్‌ఫెయిత్.డాట్.జిఆర్‌జిలో ఉద్యోగ అవకాశాల కోసం వెదికారు. ఇక్కడ వాలంటీర్ పనికొరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్ని పర్వతాలు ఉన్న ఈస్టర్ ద్వీపంలోని ఒక మారుమూల ప్రాంతంలో ఒక్క సంవత్సరం పాటు పరిచర్య చేయుటకు అవకాశం లభించింది. దానిపట్ల వారు ఆకర్షితులై, ఆ పరిచర్య చేయుట కొరకు దరఖాస్తు చేసుకున్నారు. కొద్దిసేపటి తర్వాత వారి దరఖాస్తు అంగీకరించబడినదను వార్త ఈ దంపతులకు అందజేశారు. మరియు 2 వారాలలో వారు ఈస్టర్ ద్వీపానికి బయలుదేరమని కూడా చెప్పారు.

తమ ప్రార్థనలకు దేవుడు అంత త్వరగా సమాధానము ఇవ్వడం చూచి అల్వారో దంపతులు ఆశ్చర్యపోయారు. మిషనరీలుగా ఇది వారి మొదటి పాఠం. తమ విషయంలో దేవుడు బాధ్యత వహిస్తున్నాడని చూచారు. మరియు ఆయన ప్రణాళికలకు వారు తమను తాము సమర్పించుకున్నారు.

2 వారాల తర్వాత అల్వారో కుటుంబం, 5 గంటల 30 నిమిషాలు విమానంలో ప్రయాణం చేసి ఈస్టర్ ద్వీపమును చేరుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత మారుమూల విమానాశ్రయముగా పరిగణించబడే విమానాశ్రయంలో దిగారు. ఇక్కడి నుండి తదుపరి విమానాశ్రయం దాదాపు 2,350 మైళ్ళు (3,780 కిలో మీటర్లు) దూరంలో ఉన్నది.

చాలా భిన్నమైన సంస్కృతిగల ప్రదేశంలో అల్వారో దంపతులు అడుగు పెట్టారు. చిలీ దేశంలోని ప్రధాన భూభాగమంతా, రోమన్ కథోలిక్ ప్రభావం బలంగా కలిగియున్నప్పటికీ, ఈస్టర్ ద్వీపంలోని ప్రజలు తమ పూర్వీకుల బోధనలపై ఆధారపడేవారు. చిలీ అంతటా స్పానిష్ భాష మాట్లాడుచుండగా, ఈస్టర్ ద్వీపంలోనున్న ప్రజలు “రపానుయ్” భాష మాట్లాడేవారు.

ప్రపంచంలోని అతి పొడవైన దేశాలలో చిలీ ఒకటి. చిలీ ఉత్తరం నుండి దక్షిణం వరకు దాదాపు 2,650 మైళ్ళు (4,265 కి.మీ) విస్తరించి ఉన్నది. కానీ ఈస్టర్ ద్వీపం 63 చదరపు మైళ్ళు (101 చదరపు కి.మీ) మాత్రమే విస్తరించి యున్నది. మరియు ఆ ద్వీపంలోని జనాభా 3,800. వీరిలో ఎక్కువమంది, రాజధాని “హంగారోవా” లో నివసిస్తున్నారు.

చిలీ దేశంలో ఆహార సమస్య ఉండేది కాదు. కానీ ఈస్టర్ ద్వీపంలో బ్రెడ్,రేషన్ ప్రకారం ఇవ్వబడుచుండెడిది. కొన్నిసార్లు బ్రెడ్ తయారీకి అవసరమైన పిండి కూడా లభించేది కాదు. ఆహారం పడవల ద్వారా సరఫరా చేయబడుచుండెడిది. సముద్రంలో ఏర్పడే ఆటుపోట్లు వలన పడవలు ఓడరేవుకు చేరడానికి అనుమతించబడేవి కావు. ఉన్న పరిస్థితులను ఇంకా క్లిష్టతరం చేస్తూ, చాలా మంది ద్వీపవాసులు, వేరే ప్రాంతం నుండి వచ్చిన ప్రజలను ఇష్టపడరని అల్వారో దంపతులు త్వరగా గ్రహించారు. ఈస్టర్ ద్వీపంలో స్నేహితులను సంపాదించడం మరియు ప్రజల నమ్మకం పొందడం ఈ దంపతులకు కష్టతరమైంది.

దేవుడు తమ మనవిని ఆలకించి, తమను ఎంత త్వరగా ఈ ద్వీపానికి నడిపించియున్నాడో అల్వారో మరియు నటాలియా గుర్తు చేసుకున్నారు. దేవుని మీద నమ్మకముంచి, ఆయన మీద ఆధారపడపవలెనని నిర్ణయించుకున్నారు.

అప్పుడు దేవుడు అద్భుతమైన రీతిలో పనిచేయడం ప్రారంభించాడు. అల్వారో దంతవైద్యుడిగా కాకుండా, పర్యాటక రంగం (టూరిజం) ద్వారా ఎక్కువమందిని కలుసుకొని, సెవెంత్ డే ఎడ్వెంటిస్ట్ చర్చిని ప్రోత్సహించాడు. నటాలియా స్థానిక హాస్పిటల్‌లో ఉద్యోగం సంపాదించింది. వీరు ఒక మోటార్ సైకిల్ కొని, ఇంటింటికీ వెళ్ళి ప్రజలను సందర్శిస్తూ, బైబిలు అధ్యయనాలు చేస్తున్నారు.

స్థానిక ఎడ్వెంటిస్ట్ చర్చిని నడిపించే బాధ్యత కూడా అల్వారో దంపతులపై కలదు. వీరు ఈస్టర్ ద్వీపమునకు వచ్చినప్పుడు, ఎడ్వెంటిస్ట్ చర్చిలో కేవలం 10 మంది పెద్ద వయస్సులో ఉన్న సభ్యులు ఉన్నారు. ఒక సంవత్సరం గడిచేసరికి, బాప్తిస్మాలు ఇవ్వడం మరియు వివాహాలు చేయడం తప్ప పాస్టర్ చేసే పనులన్నింటిని అల్వారో, నటాలియాలు చేశారు. వారు అంత్యక్రియలు కూడా నిర్వహించారు. వీరు చర్చిలో పనిచేస్తూ ఉన్నప్పుడే, గతంలో మూసివేయబడిన పాత్‌ఫైండర్, ఎడ్వెంచరర్స్ క్లబ్‌లను తిరిగి ప్రారంభించారు. మొదటి మీటింగ్‌కు 25 మంది పిల్లలు వచ్చారు. నెలలు గడిచే కొద్దీ పిల్లల సంఖ్య పెరిగింది. స్థానిక యువకులకు మాస్టర్ గైడ్ శిక్షణ ఇచ్చి పాత్ ఫైండర్, ఎడ్వెంచరర్ క్లబ్‌లను వారికి అప్పగించారు. అల్వారో దంపతులు ఈస్టర్ ద్వీపం నుండి వెళ్ళే సమయానికి ఈ రెండు క్లబ్‌లలో 95 మంది పిల్లలు ఉన్నారు. ఈ పిల్లలు సబ్బాతురోజున వారి తల్లిదండ్రులను చర్చికి తీసుకువస్తున్నారు. అల్వారో దంపతుల పరిచర్య వలన ఒక పాత్‌ఫైండర్ మరియు అతని తల్లి బాప్తిస్మం తీసుకున్నారు. బాప్తిస్మం నిర్వహించడానికి ఒక పాస్టర్ ఈస్టర్ ద్వీపానికి వచ్చాడు.

అల్వారో మరియు నటాలియా వారు పరిచర్య చేసిన సంవత్సరమంతయూ సవాలులతో కూడిన సంవత్సరం అని చెప్పారు. అయిననూ వారి పరిచర్యలో ఎటువంటి మార్పు ఉండదని చెప్పారు.

"ఇప్పుడు ఈస్టర్ ద్వీపంలో నున్న ఎడ్వెంటిస్ట్ చర్చికి స్థానిక నాయకత్వం ఉన్నది. పాత్‌ఫైండర్ మరియు ఎడ్వెంచరర్ క్లబ్‌లు తెరచి ఉన్నాయి. దేవుడు మాకు మార్గం తెరచి, మేము అక్కడ ఉన్న సంవత్సరకాలమంతటిలో దేవుడు అనేక కార్యములు జరిగించియున్నాడని మేము నమ్ముచున్నాము" అని నటాలియా అంటున్నారు.

అల్వారో, నటాలియా మరియు కాటాలినా చిలీ ఎడ్వెంటిస్ట్ యూనివర్సిటీలో ప్రసంగం వినిన తరువాత, అక్కడ మిషన్ వాలంటరీ శిక్షణ పొంది, తరువాత ఈస్టర్ ద్వీపంలో ఒక సంవత్సరం పాటు ఎడ్వెంటిస్ట్ వాలంటరీ సర్వీస్ మిషనరీలుగా పనిచేశారు.

ఈ త్రిమాసం యొక్క 13వ సబ్బాతు కానుకలలో కొంత భాగం చిలీ ఎడ్వెంటిస్ట్ యూనివర్సిటీలో ఎడ్వెంటిస్ట్ వాలంటరీ సర్వీస్ సెంటర్ ప్రారంభించుటకు వినియోగించబడును. ఈ సెంటర్ ద్వారా మరికొంతమంది మిషనరీలకు శిక్షణ ఇవ్వబడును. ఈ ముఖ్యమైన ప్రాజెక్టుకు ధారాళంగా కానుకలు ఇచ్చుటకు మీరు ప్రణాళిక కలిగి యున్నందులకై మీకు కృతజ్ఞతలు.

–ఆండ్రూ మెక్ ఛెస్‌నీ